నూతన నియామకం

మెట్‌పల్లి, ఫిబ్రవరి 25: బీసీ సంక్షేమ సంఘం మెట్‌పల్లి డివిజన్ ప్రధాన కార్యదర్శిగా మర్రి నందకిశోర్, మెట్‌పల్లి మండలాధ్యక్షుడిగా చింతకుంట దేవేందర్ నియమితులయ్యారు. ఈమేరకు మంగళవారం బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి బొమ్మెల శంకర్ నియామక పత్రాలను అందజేశారు. సంఘం నాయకులు నల్ల వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, సుధాకర్‌గౌడ్, రాజేశ్వర్‌గౌడ్, సురేశ్, అంజయ్య, నర్సింగరావు పాల్గొన్నారు.

కోరుట్ల, ఫిబ్రవరి 25: జాతీయ బీసీ సంక్షేమ సంఘం కోరుట్ల డివిజన్ ప్రధాన కార్యదర్శిగా పట్టణానికి చెందిన తుపాకుల భాజన్న నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం జిల్లా కార్యనిర్వహణాధికారి వెంకటేశ్వర్లు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు భాజన్న తెలిపారు. కాగా, తన నియామకానికి సహకరించిన నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. భాజన్న నియామకంపై సంఘం నాయకులు శంకర్, శిరీష్‌కుమార్, శ్రీకాంత్, సదానందం, ప్రతాప్, అజయ్ హర్షం వ్యక్తం చేశారు.

స్టాక్ మార్కెట్‌పై వెబినార్ సదస్సు

జగిత్యాల, ఫిబ్రవరి 25: జిల్లా కేంద్రంలోని ఎస్‌కేఎన్‌ఆర్ డిగ్రీ కళాశాలలో స్టాక్ మార్కెట్‌పై మంగళవారం వెబినార్ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సెబీ విషయ నిపుణుడు పద్మావతి సెల్వన్ మాట్లాడుతూ, స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడి విధానాలను వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య అరిగెల అశోక్ కుమార్ మాట్లాడుతూ, ప్రతి విద్యార్థి స్టాక్ మార్కెట్‌పై అవగాహన పెంచుకుంటే భవిష్యత్‌లో మంచి ఉపాధి లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కామర్స్ విభాగాధిపతి అంకం గోవర్ధన్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అడివి శ్రీనివాస్, ఎన్‌సీసీ అధికారి పర్లపల్లి రాజు, గ్రంథ పాలకుడు సురేందర్, రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ సాయి మధుకర్, ఎకనామిక్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీనివాస్, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

అనాథ యువతులకు ఆర్థిక సాయం

కోరుట్ల రూరల్, ఫిబ్రవరి 25: మండలంలోని ఐలాపూర్ గ్రామంలో అల్వాల గంగాధర్-జల దంపతులు ఇటీవల మృతి చెందారు. వారి కూతుళ్లు దీప్తిక, సుకన్య అనాథలయ్యారు. వారికి కోరుట్ల ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు ముక్కెర చంద్రశేఖర్ ఆధ్వర్యంలో క్వింటాల్ బియ్యం, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు రూ.5000 అందజేశారు. ఇక్కడ మార్కెట్ కమిటీ చైర్మన్ పన్నాల అంజిరెడ్డి, నాయకుడు కొంతం రాజు, ప్రెస్‌క్లబ్ సభ్యులు మల్లికార్జున్, రాజు, ప్రకాశ్, శంకర్, నాయకులు సంజీవరెడ్డి, గంగాధర్‌గౌడ్, సత్యనారాయణగౌడ్, గణేశ్, రామకృష్ణ, వెంకటస్వామి, రాజలింగం పాల్గొన్నారు.

శివపార్వతుల విగ్రహాల వితరణ

వెల్గటూర్, ఫిబ్రవరి 25: ఎండపల్లి మండలం కొత్తపేటలోని హనుమాన్ ఆలయంలో మహాశివరాత్రి సందర్భంగా శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తారు. కాగా, కల్యాణానికి గ్రామానికి చెందిన జీరెడ్డి అనూష-మహేందర్‌రెడ్డి దంపతులు శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను బహూకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

విరాళం అందజేత

మారుతీనగర్, ఫిబ్రవరి 25: మెట్‌పల్లి పట్టణంలోని శివ భక్త మార్కండేయ ఆలయ నిర్మాణం కోసం పద్మశాలీ సంఘం అధ్యక్షుడు ద్యావపల్లి రాజారాంకు రూ.25,116 గజెల్లి రాందాస్-మాధవి దంపతులు అందజేశారు. ఇక్కడ ఆలయ కమిటీ, పద్మశాలీ సంఘ సభ్యులు, తదితరులున్నారు.

'రోళ్లవాగు'కు షెట్టర్ పెట్టలేని దుస్థితిలో సర్కారు

- కళ కళ లాడాల్సిన ప్రాజెక్ట్‌లో నీళ్లు లేక ఖాళీ
- సీఎం అవివేక పాలన వల్ల పంటలన్నీ ఎండిపోతున్నయ్
- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

సారంగాపూర్, ఫిబ్రవరి 25 : రోళ్లవాగు ప్రాజెక్ట్‌కు ఒక్క షెట్టర్ పెట్టలేని దుస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మండిపడ్డారు. బీర్‌పూర్ మండలంలోని రోళ్ల ప్రాజెక్ట్‌ను మంగళవారం ఆయన బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత, మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, స్థానిక నాయకులు, రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ, గత కేసీఆర్ ప్రభుత్వంలో ప్రారంభించిన రోళ్లవాగు ప్రాజెక్ట్ ఆధునీకరణ పనులు దాదాపు పూర్తి కాగా, ఒక షెట్టర్ పెట్టడం మాత్రమే ఉందని, అది బిగిస్తే బీర్‌పూర్, ధర్మపురి మండలాల్లోని 15 వేల ఎకరాలకు సాగు నీరు ఇచ్చే అవకాశం ఉందన్నారు. కానీ, ప్రస్తుత ప్రభుత్వం 15 నెలల్లో ఒక్క షెట్టర్ కూడా పెట్టలేకపోయిందని మండిపడ్డారు. ప్రజాప్రతినిధులు పేరుకే ఉన్నారని విమర్శించారు. ఈ ప్రాంత రైతులకు ఏం కావాలి, ఏఏ పనులు చేపట్టాలి? అనే అవగాహన లేకుండా ఈ ప్రభుత్వాన్ని నడుపుతుంటే చాలా ఆశ్చర్యం వేస్తుందన్నారు. రైతుల కోసం పనిచేస్తామని చెప్పి ఇప్పుడు పట్టించుకోవడం లేదని, పైగా అవినీతి జరిగిందని విప్ లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతున్నారని, ఎక్కడ జరిగిందో ఆయనే చెప్పాలని హితవుపలికారు. కొత్తగా ఎమ్మెల్యే అయిన ఆయనకు కనీస అవగాహన లేదని, ప్రాజెక్టు నిర్మాణం ఎలా జరుగుతుంది, కట్ట వ్యవయం ఎంత పెరిగింది, జీఎస్టీ ఎలా పెరిగింది, రూ.60 కోట్ల నుంచి రూ.136 కోట్లు ఎలా అయిందో మొదట తెలుసుకోవాలని సూచించారు. అసలెప్పుడైన రివ్యూ చేశావా? దీని గురించి తెలుసుకున్నావా? గాలిమాటలు చెప్తే సమస్యలు పరిష్కారం కావని హితవుపలికారు. ఇక్కడున్న ప్రజాప్రతినిధులకు చిత్త శుద్ధి లేదని విమర్శించారు. మొన్ననే ఒక టీఎంసీ నీటిని విడుదల చేయాల్సి ఉండగా ఆఫ్ టీఎంసీ మాత్రమే వదిలి పెట్టారని, ఇంకో ఆఫ్ టీఎంసీ ఇంకో రెండు తడులకు వస్తది కావచ్చని, అవి అయిపోతే నీళ్ల సంగతి ఎంటని, 50 వేల ఎకరాల సంగతేందని, ఎండిపోతే ఎవరు సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. కావాల్సినన్ని నీళ్లు ఉండి కూడా నిర్వహణ సరిగ్గా లేదని, సీఎం రేవంత్‌రెడ్డి అవివేక పాలన వల్ల రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో పంటలు ఎండిపోతున్నాయని మండిపడ్డారు. రైతులకు కావాల్సినవి సకాలంలో ఇవ్వడం లేదని, సొసైటీల ముందు మళ్లీ చెప్పులు పెట్టే రోజులు తెచ్చారని, పోలీస్ స్టేషన్లలో యూరియా అమ్మే దుస్థితికి తీసుకువస్తున్నారని ధ్వజమెత్తారు. సన్న వడ్లకు బోనస్ ఇవ్వలేదని, రైతు భరోసాకు దిక్కులేదని, ఇప్పటిదాక మూడెకరాలు కూడా దాటలేదని విమర్శించారు. మండలంలో ఒక గ్రామాన్ని ఎంపిక చేస్తారా? ఇది అసలు తెలివి ఉన్న ప్రభుత్వమేనా? ఒక గ్రామంలోనే రైతులు ఉంటారా? మిగిలిన రైతులు ఎక్కడికి పోవాలె? అని నిలదీశారు. సీఎంకు ఆలోచన లేదు, కింద పనిచేస్తున్న మంత్రులకు లేదు, ఇక్కడ పనిచేస్తున్న ఎమ్మెల్యేలకు అంతకన్నా లేదని ఘాటుగా విమర్శించారు. రోళ్లవాగు ప్రాజెక్ట్‌కు షెట్టర్ ఎప్పుడు పెట్టి, నీళ్లు ఎప్పుడు ఇస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. మాజీ జడ్పీటీసీ రమణ, బీఆర్ఎస్ సారంగాపూర్ మండలాధ్యక్షుడు తేలు రాజు, ప్రధాన కార్యదర్శి గంగారెడ్డి, విండో మాజీ చైర్మన్ రాజేశం, బీర్‌పూర్, ధర్మపురి మండలాల నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.



రోళ్లవాగు ప్రాజెక్ట్‌ను పరిశీలించిన అనంతరం విలేకరులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, పక్కన బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత, తదితరులు



కథలాపూర్: మండల కేంద్రంలో విద్యార్థి తయారు చేసిన ప్రయోగాన్ని తిలకిస్తున్న అధికారులు

విద్యాసంస్థల్లో సైన్స్ దినోత్సవం

కథలాపూర్/మేడిపల్లి/రాయికల్, ఫిబ్రవరి 25: కథలాపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో, మేడిపల్లిలోని మోడల్ స్కూల్, రాయికల్ మండలం కుమ్మరిపెల్లి, మూటపెల్లిలోని ప్రభుత్వ పాఠశాలల్లో మంగళవారం ముందస్తు సైన్స్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వైజ్ఞానిక ప్రదర్శనలు ఏర్పాటు చేయగా, విద్యార్థులు వివిధ రకాల ప్రయోగాలు తయారు చేసి ప్రదర్శించారు. ప్రయోగాల పనితీరును సందర్శకులకు వివరించారు. మంచిగా ప్రయోగాలు తయారు చేసిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో కథలాపూర్ ఎంఈవో శ్రీనివాస్, ఏవో యోగితా, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

వందశాతం పన్నులు వసూలు చేయాలి

కోరుట్ల రూరల్, ఫిబ్రవరి 25: గ్రామాల్లో వందశాతం పన్నులు వసూలు చేయాలని అదనపు కలెక్టర్ బీఎస్ లత పంచాయతీ అధికారులను ఆదేశించారు. పైడిమడుగు గ్రామంలో చేపట్టిన పారిశుధ్య పనులను మంగళవారం ఆమె పరిశీలించారు. గ్రామాల్లో ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేపట్టాలని సూచించారు. వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ఇంటి పన్ను వసూలు చేయాలని ఆదేశించారు. కాగా, గుమ్లాపూర్‌లో ఉపాధి హామీ పనులను ఎంపీడీవో వోదెల రామకృష్ణ పరిశీలించారు. నర్సరీ, పల్లె ప్రకృతి వనంలో రోజూ నీళ్లు పట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో జీవాకర్‌రెడ్డి, తహసీల్దార్ కిషన్, కార్యదర్శి శేఖర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



చేతిపంపును పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ బీఎస్ లత

ఆర్టీసీ సేవలను వినియోగించుకోవాలి

ప్రత్యేక బస్సుల కౌంటర్ వద్ద డిపో మేనేజర్, ఉద్యోగులు

కోరుట్ల, ఫిబ్రవరి 25: వేములవాడలో మహాశివరాత్రి జాతర కోసం కోరుట్ల డిపో నుంచి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆర్టీసీ బస్సు సర్వీస్ సేవలను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ మనోహర్ పేర్కొన్నారు. కొత్త బస్టాండ్ ఆవరణలో జాతర ప్రత్యేక బస్సుల క్యాంపును మంగళవారం ఆయన ఉద్యోగులతో కలిసి ప్రారంభించారు. వేములవాడ జాతర సందర్భంగా ఈనెల 25 నుంచి 27 వరకు కోరుట్ల డిపో నుంచి 62 ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డీఎం తెలిపారు. దేవస్థానం పక్కన చెరువు కట్ట వరకు బస్సులు వెళ్తాయన్నారు. పెద్దలకు రూ. 120, పిల్లలకు రూ. 70 టికెట్ ధర నిర్ణయించినట్లు చెప్పారు. ఆర్టీసీ ఉద్యోగులు, డ్రైవర్లు, కండక్టర్లు ఉన్నారు.

భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలి

సారంగాపూర్: పోలీసు అధికారులకు భద్రతా ఏర్పాట్ల గురించి సూచనలు చేస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

సారంగాపూర్/మల్లాపూర్, ఫిబ్రవరి 25: దుబ్బ రాజేశ్వర స్వామి, కనక సోమేశ్వరస్వామి జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని ఎస్పీ అశోక్‌కుమార్ సూచించారు. సారంగాపూర్ మండలం పెంబట్లలోని దుబ్బ రాజేశ్వర స్వామి, మల్లాపూర్‌లోని కనక సోమేశ్వరస్వామి ఆలయంలో మహా శివరాత్రి ఉత్సవాల సందర్భంగా చేస్తున్న ఏర్పాట్లను మంగళవారం ఆయన పరిశీలించారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా మెరుగైన సదుపాయాలు కల్పించాలన్నారు. ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా బారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఉత్సవాలకు వచ్చే భక్తులు పోలీసులకు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి డీఎస్పీ రాములు, దుబ్బ రాజేశ్వర స్వామి ఆలయ ఈవో అనూష, ట్రస్ట్ ఫౌండర్ పొరండ్ల శంకరయ్య, సీఐలు కృష్ణారెడ్డి, నిరంజన్‌రెడ్డి, ఎస్ఐలు దత్తాద్రి, రాజు, తదితరులు పాల్గొన్నారు.

దుబ్బ రాజన్న ఆలయంలో మాజీ మంత్రి పూజలు

సారంగాపూర్, ఫిబ్రవరి 25: మండలంలోని పెంబట్ల దుబ్బరాజేశ్వర స్వామి ఆలయంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మంగళవారం బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్ రావు, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత, మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డితో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. వారి వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తేలు రాజు, నాయకులు అనంతుల గంగారెడ్డి, ఎండబెట్ల ప్రసాద్, సాంబారి గంగాధర్, అరవింద్, అత్తినేని నరేశ్, బాదినేని వెంకటేశ్, రాజేందర్, మధుకర్ రావు, కొంగరి లింగరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ నాయకుడికి ఘన నివాళి

కోరుట్ల, ఫిబ్రవరి 25: పట్టణంలోని సీ ప్రభాకర్ భవనంలో మంగళవారం బీడీ కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు కడకుంట్ల గంగారాం వర్ధంతిని సీపీఐ నాయకులు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీడీ కార్మికుల సంక్షేమం కోసం గంగారాం చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ మాజీ సభ్యుడు చెన్న విశ్వనాథం, ఎండీ మౌలానా, బీడీ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి సుతారి రాములు, పట్టణ కార్యదర్శి ఎన్నం రాధ, సాంబారి మహేశ్, కొక్కుల గంగాధర్, అందె వంశీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మన ఆహారం-మన ఆర్యోగంపై అవగాహన

కోరుట్ల, ఫిబ్రవరి 25: పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ వారోత్సవాలను పురస్కరించుకొని మంగళవారం విద్యార్థులకు మన ఆహారం-మన ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు కలుషితమైన ఆహారం తిన వద్దని, పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఇక్కడ ప్రధానోపాధ్యాయుడు కృష్ణమోహన్‌రావు, ఉపాధ్యాయులు రవూఫ్, నాగరాజు, లక్ష్మీ నారాయణ తదితరులున్నారు.

మహాశివరాత్రి వేడుకలకు శైవక్షేత్రాలు ముస్తాబు

ధర్మపురి/మేడిపల్లి/సారంగాపూర్, ఫిబ్రవరి 25: ధర్మపురి, మేడిపల్లి, భీమారం, సారంగాపూర్ మండలాల్లోని శివాలయాల్లో బుధవారం మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఉత్సవాలు నిర్వహించేందుకు సర్వంగా సుందరంగా ముస్తాబు చేశారు. అలాగే, ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి, రామలింగేశ్వరాలయం, అక్కపెల్లి రాజరాజేశ్వరాలయంలో ఏర్పాట్లు చేశారు. ఆలయాలకు రంగులు వేయించి, విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేసినట్లు ఆయా ఆలయాల అధికారులు తెలిపారు.

పెద్ద చెరువులోకి నీటిని విడుదల చేయాలి

రాయికల్, ఫిబ్రవరి 25: పట్టణంలోని పెద్ద చెరువు ఎండి పోయి నందున డీ-521 కాలువ ద్వారా నీటిని విడుదల చేయాలని తహసీల్ కార్యాలయంలో నాయబ్ తహసీల్దార్ గణేశ్‌కు మంగళవారం రైతులు వినతి పత్రం అందజేశారు. చెరువు ఎండిపోవడంతో సాగు, తాగునీటికి ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉందన్నారు. పెద్ద చెరువును నింపాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు శ్రీధర్, మహేశ్, గంగారెడ్డి, రాములు, సాయిరాం, గోపి, గంగాధర్, నరేందర్ పాల్గొన్నారు.

ఆరోగ్య పరిరక్షణతోనే విద్యలో రాణించవచ్చు

జగిత్యాల రూరల్, ఫిబ్రవరి 25: ఆరోగ్య పరిరక్షణతోనే విద్యలో రాణించవచ్చని ఐఎంఏ జగిత్యాల పట్టణాధ్యక్షుడు గూడూరి హేమంత్, ప్రధాన కార్యదర్శి ఆకుతోట శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఐఎంఏ జగిత్యాల శాఖ ఆధ్వర్యంలో పొరండ్లలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం బాలికలకు అనీమియా పరీక్షలు నిర్వహించారు. 79 మంది విద్యార్థినులు రక్తహీనతతో బాధపడుతున్నట్లు గుర్తించి, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు గూడూరి శ్రీలత, రాచకొండ నాగరత్న, దురిశెట్టి శ్రీకాంత్, ప్రధానోపాధ్యాయుడు మురళీమోహనాచారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఉద్యోగికి సత్కారం

మెట్‌పల్లి టౌన్, ఫిబ్రవరి 25: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మున్సిపల్ పారిశుధ్య విభాగంలో విధులు నిర్వహిస్తున్న ముజీబ్‌ను కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు శాలువాతో సత్కరించి, జ్ఞాపిక అందజేశారు. ముజీబ్ ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలందించడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

జగిత్యాల రూరల్, ఫిబ్రవరి 25: జగిత్యాల రూరల్ మండలం తాటిపల్లి గ్రామానికి చెందిన బోయిని గంగవ్వ మృతి చెందగా, బాధిత కుటుంబాన్ని మంగళవారం ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ పరామర్శించారు. ఆయన వెంట నాయకులు శంకర్, ఆంజనేయులు, గంగారెడ్డి, తిరుపతి, మాజీ కౌన్సిలర్ రాజేశ్, తదితరులున్నారు.

తడి, పొడి చెత్త వేర్వేరుగా అందించాలి

తడి, పొడి చెత్త వేరు చేయడంపై అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ అధికారులు

కోరుట్ల, ఫిబ్రవరి 25: తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందించాలని మున్సిపల్ అధికారులు పేర్కొన్నారు. పట్టణంలోని పలు వార్డుల్లో మంగళవారం మున్సిపల్ ఆధ్వర్యంలో స్వచ్ఛ సర్వేక్షన్‌లో భాగంగా పరిసరాల పరిశుభ్రత, తడి, పొడి చెత్త సేకరణపై కాలనీవాసులకు అధికారులు అవగాహన కల్పించారు. ప్రభుత్వం అందించిన ఆకుపచ్చ ప్లాస్టిక్ బుట్టలో తడి, నీలి రంగు బుట్టలో పొడి చెత్తను మీ ఇంటి వద్దకు వచ్చే మున్సిపల్ వాహనానికి అందించాలని సూచించారు. నిషేధిత ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు వినియోగించవద్దన్నారు. ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఇక్కడ శానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్, మున్సిపల్ ఎన్విరాన్మెంటల్ ఇంజినీర్ మహేశ్, వార్డు ఆఫీసర్లు, కాలనీ మహిళలు ఉన్నారు.

వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సరఫరా

కొత్తగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఏడీఈ వరుణ్‌కుమార్, ఏఈ వెంకటరెడ్డి

పెగడపల్లి, ఫిబ్రవరి 25: వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఏడీఈ వరుణ్‌కుమార్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన 100 కేవీ, 63 కేవీ రెండు ట్రాన్స్‌ఫార్మర్లను మంగళవారం ఆయన పెగడపల్లి ఏఈ వెంకటరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏడీఈ మాట్లాడుతూ, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుతో మండల కేంద్రంలో వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సరఫరా చేస్తామని తెలిపారు. వ్యవసాయ విద్యుత్ మోటర్లకు రైతులు తప్పనిసరిగా కెపాసిటర్లను బిగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ సిబ్బంది వేణుగోపాల్, బిక్షపతి, ముణిరాజ్, రాజేందర్, పరశురాం తదితరులు పాల్గొన్నారు.

పంట పొలాల పరిశీలన

కొడిమ్యాల, ఫిబ్రవరి 25: మండలంలోని పూడూర్ గ్రామంలో వరి చేలను జిల్లా ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త మదన్‌మోహన్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు కాండం తొలిచే పురుగు, అగ్గితెగులు నివారణకు చేపట్టే చర్యలను వివరించారు. ఆయిల్ పామ్ సాగు చేస్తున్న రైతులకు పలు సూచనలు చేశారు. ఏవో జ్యోతి, ఏఈవోలు రాజేశ్, గ్రిష్మా, శ్రీలత, రైతులు రామ్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వరిని పరిశీలిస్తున్న శాస్త్రవేత్త మదన్ మోహన్

గడువులోగా లక్ష్యం పూర్తి చేయాలి

జగిత్యాల, ఫిబ్రవరి 25: స్త్రీనిధి రుణాల లక్ష్యాన్ని నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని డీఆర్డీవో రఘువరన్ ఏపీఎంలు, సీసీలు, స్త్రీనిధి అసిస్టెంట్ మేనేజర్లను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం జిల్లా స్థాయి ఐకేపీ సిబ్బందితో స్త్రీనిధి రుణాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. మహిళా సంఘాల సభ్యుల స్వయం ఉపాధి కోసం రుణాలు అందించాలని సూచించారు. స్త్రీనిధి జోనల్ మేనేజర్ రవికుమార్ మాట్లాడుతూ, స్త్రీనిధి రుణాలు తీసుకున్న వారు సకాలంలో చెల్లించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా డీపీఎంలు మానిక్ రెడ్డి, విజయ భారతి, వెంకటేశ్, మల్లేశం, స్త్రీనిధి రీజినల్ మేనేజర్ రాం నారాయణ, ఏపీఎంలు, సీసీలు, స్త్రీనిధి అసిస్టెంట్ మేనేజర్లు, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన వీడ్కోలు హంగామా

మల్యాల(కొడిమ్యాల), ఫిబ్రవరి 25: మల్యాలలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ప్రథమ సంవత్సరం విద్యార్థులు మంగళవారం వీడ్కోలు కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మోతే శివరామకృష్ణ మాట్లాడుతూ, ప్రతి విద్యార్థికి ఇంటర్ విద్య కీలకమని తెలిపారు. కష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలని సూచించారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు అత్తినేని శ్రీనివాస్, సంధ్య, మహ్మద్ నవాబ్, శ్రీనివాస్, పూర్ణిమా తదితరులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్ల ప్రదానం

మల్యాల(కొడిమ్యాల), ఫిబ్రవరి 25: మల్యాల మండల కేంద్రంలోని రైతు వేదికలో వారం రోజులుగా రైతులకు పుట్టగొడుగుల పెంపకంపై నిర్వహిస్తున్న శిక్షణ ముగింపు కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా డీఆర్డీవో రఘువరన్ హాజరై శిక్షణ పూర్తయిన రైతులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. అంతకు ముందు మద్దుట్ల గ్రామంలో పశువుల పాక నిర్మాణాలు, పోతారం గ్రామంలో కూలీలతో చేయిస్తున్న కందకాల పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఆర్డీవో మదన్‌మోహన్, ఎంపీడీవో స్వాతి, ఎంపీవో ప్రవీణ్, ఏపీవో శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘం సందర్శన

కొడిమ్యాల, ఫిబ్రవరి 25: మండలంలోని పూడూర్ సహకార సంఘాన్ని మంగళవారం నాబార్డ్ డీడీఎం దిలీప్‌చంద్ర, మేనేజర్ హరిహరన్ సందర్శించారు. ఈ సందర్భంగా నాన్ క్రెడిట్ బిజినెస్ చేయడానికి అవకాశాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సంఘం చైర్మన్ బండ రవీందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ సావనపల్లి రమేశ్, డైరెక్టర్లు, సీఈవో రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

యూరియా కొరత లేకుండా చూడాలి

మెట్‌పల్లి రూరల్, ఫిబ్రవరి 25: మెట్‌పల్లి సబ్ డివిజన్ పరిధిలో యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని మెట్‌పల్లి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి కోరారు. ఈమేరకు మంగళవారం జగిత్యాల డీఏవో రాంచందర్‌రావుకు ఫోన్ ద్వారా విన్నవించారు. వెంటనే రైతులకు సరిపడా యూరియా సరఫరా చేయాలని కోరారు.

అక్రమంగా నిల్వ చేసిన ఇసుక సీజ్

కథలాపూర్, ఫిబ్రవరి 25: కథలాపూర్ మండలం సిరికొండ, దూలూర్ గ్రామాల్లో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుకను సీజ్ చేసినట్లు తహసీల్దార్ వినోద్ మంగళవారం తెలిపారు. ఆయా గ్రామాల్లో తనిఖీలు చేపట్టగా సిరికొండలో 20 ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుక, దూలూర్ గ్రామంలో 15 ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుక నిల్వలు కనిపించాయన్నారు. వాటిని సీజ్ చేసి వేలం పాట ద్వారా నీటిపారుదల శాఖ అధికారులకు అప్పగించామన్నారు. ఈ తనిఖీల్లో ఆర్ఐ నాగేశ్ పాల్గొన్నారు.

ఘనంగా ఎన్ఎస్‌వీ కళాశాల వార్షికోత్సవం

జగిత్యాల, ఫిబ్రవరి 25: పట్టణంలోని రెడ్డి ఫంక్షన్ హాల్‌లో ఎన్ఎస్‌వీ డిగ్రీ కళాశా